

జడ్చర్ల మున్సిపాలిటీలోని సిగ్నల్‌గడ్డ వద్ద శోభాయాత్రలో మహిళల కోలాటం



జిల్లాకేంద్రంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



పాలకొండ బైపాస్ వద్ద ఆర్టీఏ అధికారులు



నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్పీ జానకి, పోలీసులు



నాగసాల చెరువు వద్ద నిమజ్జనం పర్యవేక్షిస్తున్న పోలీసులు

గంగమ్మ ఒడికి.. గౌరీ తనయుడు

స్టేషన్ మహబూబ్‌నగర్/పాలమూరు: జై బోలో గణేశ్ మహారాజ్‌కీ.. బైబై గణేశా.. వెళ్లిరావయ్యా.. వినాయక.. అంటూ నవరాత్రులు విశేష పూజలు చేసిన గణనాథులను శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. జిల్లాకేంద్రం, జడ్చర్ల, చిన్నచింతకుంటలో వినాయక శోభాయాత్రలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భాజబజంత్రీల మధ్య లడ్డూల వేలం పాటలు కొనసాగాయి. మహిళల బతుకమ్మలు, కోలాటాలు, దాండియా, డీజే శబ్దాలకు యువకులు, చిన్నారుల నృత్యాలు అలరించాయి.



జిల్లా కేంద్రంలోని గణనాథులను సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసుకుంటున్న పట్టణ ప్రజలు, యువత

25లారీలు ఏర్పాటు

జిల్లా కేంద్రంలోని కొలువుదీరిన గణనాథులలో కొన్నింటిని పాలకొండ చెరువు, చిన్నదర్పల్లి, హన్వాడతోపాటు చుట్టుపక్కల చెరువులకు తీసుకెళ్లారు. భారీ గణనాథులను బీచుపల్లికి తరలించారు. పాలకొండ చౌరస్తాలోని బైపాస్ రోడ్డుపై ఏర్పాటు చేసిన లారీల్లో మున్సిపల్ సిబ్బంది సహాయంతో మండప నిర్వా హకులు గణనాథులను లారీల్లో ఎక్కించారు. ఆర్డీవో రఘుకుమార్ గణనాథులను తరలించే ప్రక్రియ పర్యవేక్షించారు. ఒక్కో లారీలో 20నుంచి 30గణనాథులను ఎక్కించారు.

⇨ పాలమూరు పట్టణంలో శుక్రవారం నిర్వహించిన గణనాథుడి నిమజ్జన శోభయాత్రకు పోలీస్ శాఖ భారీ పోలీస్ భద్రత ఏర్పాటు చేసింది. ఎస్పీ జానకితోపాటు అదనపు ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, 8మంది సీఐలు, 10మంది ఎస్ఐలు, 20 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుల్స్, 150కానిస్టేబుళ్లు, 30మంది స్పెషల్ పార్టీ, 50మంది హోంగార్డులను ఉపయోగించారు. ప్రతి విగ్రహం వద్ద కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయగా మజీద్, ఆలయాల వద్ద పికెట్ నిర్వహించారు. ప్రతి విగ్రహానికి జియో టాగ్ చేసిన పోలీసులు రూట్‌మ్యాప్ ప్రకారం తరలించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రత్యేక ఫోర్స్‌తోపాటు ఎస్పీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్, నిఘా కెమెరాల ద్వారా ప్రత్యేక సిబ్బంది పర్యవేక్షించారు. పట్టణంలో గణనాథుల శోభయాత్ర సందర్భంగా ప్రధానంగా పట్టణంలో క్లాక్‌టవర్, అంబేడ్కర్ చౌరస్తా, పాతపాలమూరు. పాన్‌చౌరస్తాలలో ఊరేగింపు వద్ద ప్రత్యేక బందోబస్తు కేటాయించారు.

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని గణనాథులను మండపాల నిర్వాహకులు శుక్రవారం శోభాయాత్రగా నిమజ్జనానికి తరలించారు. నాగసాల చెరువు వద్ద మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేయగా.. రెండు భారీ క్రేన్ల సహాయంతో నిమజ్జనం కొనసాగించారు. వీహెచ్‌పీ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అఖిల్‌రెడ్డి ఆధ్వర్యంలో నేతాజీ చౌరస్తాలో స్వాగత మండపం ఏర్పాటు చేయగా.. మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కౌన్సిలర్లు స్వాగతం పలికారు. డీటీసీ డీఎస్పీ గిరిబాబు ఆధ్వర్యంలో సీఐలు కమలాకర్, రత్నం, మగ్దుం అలీ, నాగార్జునగౌడ్ అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. సిగ్నల్‌గడ్డ తహసీల్దార్ కార్యాలయం వద్ద ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో స్వాగత మండపం ఏర్పాటు చేశారు. ఎంపీ డీకే అరుణ, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి గణనాథుదలకు పూలమాల వేసి మండపం స్వాగతం పలికారు.



విద్యుత్‌కాంతులతో తరలుతున్న గణనాథుడు



వేంకటేశ్వరస్వామి అవతారంలో వినాయకుడు

గణేశ్ నిమజ్జనంలో కలెక్టర్



కలెక్టరేట్‌లోని గణేశ్‌డి లడ్డును స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కలెక్టరేట్‌లో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ నిజమజ్జనంలో కలెక్టర్ విజయేందిర బోయి పాల్గొన్నారు. ఈ మేరకు ప్రత్యేక పూజల అనంతం, లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కలెక్టరేట్‌లో 21ఏళ్లుగా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించుకోవడం గొప్ప విషయమని, అన్నప్రసాదాలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు శివేంద్రప్రతాప్, నర్సింహారెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగల సంఘం అధ్యక్షుడు నరేందర్, రాజశేఖర్, చంద్రయ్య, మల్లేశ్, భాస్కర్, మహేశ్, శ్రీను, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



జడ్చర్ల మున్సిపాలిటీ హనుమాన్ స్ట్రీట్‌లో కోలాటం వేస్తున్న మహిళలు



జడ్చర్ల మున్సిపాలిటీలోని స్వాగత మండపం వద్ద చిందులు వేస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ వద్ద మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



చిన్నచింతకుంటలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



జిల్లా కేంద్రంలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న నిర్వాహకులు



జిల్లా కేంద్రంలో ప్రసాదాన్ని భక్తులకు పంచుతున్న దృశ్యం

క్లుప్తంగా

అడ్డాకుల ఎంఈఓగా ప్రకాశ్

అడ్డాకుల: అడ్డాకుల ఎంఈఓగా జీహెచ్‌ఎం ప్రకాశ్ నియమితులయ్యారు. ఎంఈఓగా పని చేస్తున్న కురుమూర్తి ఇటీవల ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో కన్మనూర్ జీహెచ్‌ఎంగా పనిచేస్తున్న ప్రకాశ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు ఎంఈఓను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అడ్డాకుల ఎమ్మార్సీ వద్ద ఉన్న సర్వేపల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మూసాపేటలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

చిన్నచింతకుంట: మండలం చిన్నవడ్డేమాన్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు కలిసి శుక్రవారం లబ్ధిదారులతో భూమిపూజ చేశారు. కార్యక్రమానికి పార్టీ మండల నాయకుడు శివ హాజరై లబ్ధిదారులకు ప్రొసీడింగులు అందజేశారు.

అయ్యప్ప దీక్ష ప్రచార సమితి మండలాధ్యక్షుడి ఎన్నిక

భూత్పూర్: అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి మండలాధ్యక్షుడిగా వెంకటస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మునిరంగస్వామి ఆలయంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సీమనరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వెంకట్‌స్వామిని శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం సీమ నరేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, అన్నదాన కమిటీ అధ్యక్షుడు రఘురాంగౌడ్, కార్యదర్శి మంతరవిజయశంకర్, నగర కమిటీ అధ్యక్షుడు నర్సింహారావు, కార్యదర్శి యాదయ్యగౌడ్, కోశాధికారి బాలప్రసాద్, సహాయ కార్యదర్శి కుర్మయ్య పాల్గొన్నారు.

మొక్కజొన్న కంకులు చోరీ: దొంగకు దేహశుద్ధి

నవాబుపేట: మొక్కజొన్న పంటలో కొన్నిరోజులుగా కంకులను చోరీ చేస్తూ జిల్లా కేంద్రంలో విక్రయిస్తున్న వ్యక్తిని శుక్రవారం గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేసిన ఘటన చోటుచేసుకుంది. మండలంలోని పోమాల్, కామారం, కేశవరావుపల్లి తదితర గ్రామాల్లో కొన్నిరోజులుగా మొక్కజొన్న కంకులు చోరీ జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు కాపుకాసి దొంగను పట్టుకుని దేహశుద్ధి చేశారు. కాగా అతడు కొందుర్గు మండలానికి చెందిన తుర్క యాదయ్యగా గుర్తించారు.

ఘనంగా వాసవీమాత పల్లకీసేవ

దేవరకద్ర: దేవరకద్ర మున్సిపాలిటీలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ కార్యక్రమాలు చేయగా.. సాయంత్రం సామూహిక కుంకుమార్చన, పల్లకీసేవ నిర్వహించారు. అలాగే ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయంలో శుక్రవారం గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయాలనికి వచ్చిన భక్తులు గోమాతకు పండ్లు, పూలు సమర్పించారు.

ఎస్సీ సంఘాల సమాఖ్య భవనానికి స్థల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక అంబేడ్కర్ కళాభవన్ ఆవరణలో ఎస్సీ సంఘాల సమాఖ్య భవనం నిర్మించేందుకు శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సీ సంఘాల సమాఖ్య రాష్ట్ర చైర్మన్ వెంకటస్వామి, అధ్యక్షుడు నర్సింహులు, గౌరవాధ్యక్షుడు సామెల్, ఉపాధ్యక్షుడు బాల్‌రాజు, నాయకులు శివకుమార్, నర్సింహులు, రాములు, మాజీ కౌన్సిలర్లు నర్సింహులు, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇక్కడ స్థలం కేటాయించినందుకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వారు ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

డీసీసీబీలో అవినీతిపై విచారణ చేపట్టాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఉమ్మడి జిల్లా డీసీసీబీలో అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీసీబీలో కొందరు పనిగట్టుకొని అవినీతికి పాల్పడుతున్నారని, కొందరు ఉన్నతాధికారులు సొంత నిర్ణయాలతో ఉద్యోగులను వేధిస్తుండడం, పేస్కేల్ లేని ఉద్యోగులను బదిలీ చేస్తామంటూ బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరుగనున్న సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో సాయుధ పోరాట అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించాలని పిలుపునిచ్చారు.

సమాజ నిర్మాతలుగా తీర్చిదిద్దాలి: ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులను నవసమాజ నిర్మాతలుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని వాగ్దేవీ జూనియర్ కళాశాలలో టీపీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. పాలమూరును ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిద్దిదేందుకు కృషి చేస్తున్నామని, అందుకు ఉపాధ్యాయులు తమవంతుగా కృషి చేయాలన్నారు. విద్యార్థులకు తరగతులు సులభంగా అర్థమయ్యేందుకు డిజిటల్ కంటెంట్‌ను అందిస్తున్నామని, ఈ సందర్భంగా వివిధ మండలాలకు చెందిన 38మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే సన్మానం చేశారు. కార్యక్రమంలో టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంబాబు, భూపతిసింగ్, రాంచంద్రరాథోడ్, జనార్దన్, రాజునాయక్, వెంకటయ్య, బలరాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

యూరియా కోసం రైతుల ఆందోళన

- దేవరకద్రలో గంటపాటు రాస్తారోకో
- పెద్ద ఎత్తున నిలిచిన వాహనాలు

దేవరకద్ర: దేవరకద్రలో యూరియా కోసం మరోసారి రైతులు రోడ్డెక్కారు. శుక్రవారం ఉదయం వివిధ గ్రామాల నుంచి రైతులు దేవరకద్రకు చేరుకొని ఉదయం 7గంటల నుంచి పట్టణంలోని షాపులన్నీ తిరిగి ఎక్కడా యూరియా ఇచ్చే పరిస్థితి కనిపించక పోవడంతో ఆందోళనకు దిగారు. కొత్తబస్టాండ్ సమీపంలోని రాయిచూర్ రోడ్డుపైకి వందలాది మంది రైతులు చేరుకుని రాస్తారోకో చేశారు. దాదాపు గంటసేపు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఉదయం 9గంటల వరకు రాస్తారోకో కొనసాగింది. దీంతో రాయచూర్– మహబూబ్‌నగర్ రోడ్డులో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో ఎస్ఐ నాగన్న రైతులతో చర్చించి అధికారులతో మాట్లాడిస్తానని నచ్చచెప్పి రాస్తారోకోను విరమింపజేశారు.



దుకాణం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

ఫోన్ చేసినా స్పందించని అధికారులు

రాస్తారోకోను విరమించిన తర్వాత ఎస్ఐ నాగన్న రైతులతో వ్యవసాయ అధికారికి ఫోన్ చేయించారు. అయితే వ్యవసాయ అధికారి ఫోన్‌లో స్పందించపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల కోసం ఎదురుచూసిన రైతులు చేసేది లేక నిరాశతో వెనుదిరిగి పోయారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చిన్నచింతకుంట: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొకుంట్ల మండలం అప్పంపల్లిలో నూతన రేషన్ షాపును ప్రారంభించారు. అనంతరం పేదలకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు. సన్నబియ్యం పంపిణీలో గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని డీలర్ స్వాతి సీతన్నకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్లుగా పేదలను విస్మరించిందన్నారు. పేదలకు ఎలాంటి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ఆరోపించారు. పేదలకు ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. అనంతరం దాసర్‌పల్లికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా.. కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, మండలాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, కురుమూర్తి స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి తహసిల్దార్ సుందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



అప్పంపల్లిలో బియ్యాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవుడిని నిండు మనస్సుతో ప్రార్థించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: దేవుడిని నిండు మనస్సుతో ప్రార్థిస్తే ఆయన మనస్థితిగతుల్ని మార్చి అద్భుతాలు చేస్తాడని అంతర్జాతీయ ముఖ్య ప్రసంగీకులు డా.కేవీ పాల్ అన్నారు. రెమా వర్షిప్ సెంటర్ ఆధ్వర్యంలో పాస్టర్ బీఎస్ పరంజ్యోతి అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని జేజే ఆర్ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన ఉపవాస ప్రార్థన పండుగలు చివరిరోజు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన ఆంగ్లంలో ప్రసంగించగా పాస్టర్ పరంజ్యోతి తెలుగులో అనువాదం చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు జోయల్‌బాబు, యేసుపాదం, సుందర్‌పాల్, తిమోతి, వేదాంతిబాబు, నాగరాజు, ఐజక్, మార్టిన్, హానోక్, సంఘపెద్దలు లక్ష్మన్న, దేవయ్య, వడ్డేపల్లి రాజు, శ్యామ్‌సుందర్‌తోపాటు, అధిక సంఖ్యలో విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

నవాబుపేట: ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరగాలని ఎస్ఐ విక్రమ్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. శనివారం జరిగే గణేశ్ నిమజ్జనంలో అందరూ భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. అధికశబ్దం చేసే డీజేలకు అనుమతి లేదని, దీన్ని గమనించాలన్నారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఉత్సవ సమితీ నిర్వాహకులకు సూచించారు. బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, అనుక్షణం విద్యుత్ సరఫరాపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు.

'పత్తికి మద్దతు ధర ఇవ్వాలి'

దేవరకద్ర: పత్తి రైతుకు మద్దతు ధర ఇవ్వాలని అఖిల భారత రైతు ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు కొండారెడ్డి, టీయూసీఐ జిల్లా కార్యదర్శి సాంబశివుడు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పత్తికి మద్దతు ధర రూ.10వేల75 చెల్లించాలని, పూర్తి రుణ మాఫీని చేసి ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.25లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూరియా కొరతను వెంటనే నివారించాలని రాష్ట్రానికి రావాల్సిన 9.80లక్షల మెట్రిక్ టన్నులలో ఇప్పటి వరకు 5.50 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేశారని మిగతా 4లక్షల మెట్రిక్ టన్నులకుపైగా పంపిస్తే యూరియా కొరత ఉండదని పేర్కొన్నారు.

బెల్టు షాపుపై పోలీసుల దాడి

అడ్డాకుల: మండలంలోని తిమ్మాయిపల్లిలో శుక్రవారం రాత్రి పోలీసులు బెల్టు షాపుపై దాడి చేశారు. బేరి సరోజకు చెందిన షాపులో తనిఖీలు చేయగా 23 బీర్లు, 12 క్వార్టర్లు పట్టుబడినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మజీదుల్లో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు, పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మజీదుల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ప్రత్యేక ప్రార్థనలు, దువా, చిన్నారులు, యువత భక్తిగీతాలు ఆలపించారు. మజీదుల్లో మతపెద్దలు ధార్మిక సందేశాలు ఇచ్చారు.

⇨ చిన్నచింతకుంట మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

⇨ భూత్పూర్ మున్సిపాలిటీ అమిస్తాపూర్‌లోని జామియా మసీద్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



ఎదిర వార్డులో ధార్మిక సందేశం ఇస్తున్న మౌలానా జునేద్‌ఖాద్రీ

ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి

భూత్పూర్: మండలంలోని తాటిపర్తిలో శుక్రవారం మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలోని సర్వేపల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటయ్య, ఫసియోద్దీన్, కేశవులు, బాలరాజు, విక్రం, కాశీపాండ్యన్, సిద్ధయ్య తదితరులు ఉన్నారు.

⇨ మిడ్జిల్ మండలంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఉపాధ్యాయ సంఘాలు ఘనంగా నిర్వహించాయి. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ సమీపంలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నర్సింహులు, మల్లయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, జానకమ్మ, వెంకటయ్య, సందీప్, కృష్ణనాయక్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మిడ్జిల్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పీయూ ప్రిన్సిపాల్‌కు అభినందన



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు అందుకున్న పీయూ ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డిని శుక్రవారం వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేశ్‌బాబు అభినందించారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి వాగునుంచి అనుమతి లేకుండా శుక్రవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించి టిప్పర్ ఓనర్, డ్రైవర్‌పై శనివారం సాయంత్రం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. మండలంలోని కొత్తూర్ సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును శుక్రవారం తహసీల్దార్ రాజు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాజు తెలిపారు.

రేపు ముదిరాజ్ మహిళా గర్జన

మెట్టుగడ్డ: జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో ఆదివారం ముదిరాజ్ మహిళా గర్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలంగాణ ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముదిరాజ్ మహిళా గర్జనకు ముదిరాజ్ బంధుమిత్రులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మెగా రక్తదాన శిబిరం విజయవంతం



మహబూబ్‌నగర్ క్రైం: మిలాద్ ఉన్–నబీ సందర్భంగా టీం సోషల్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలో రెడ్‌క్రాస్ సహకారంతో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కోత్వాల్, ఎస్పీ డి.జానకి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ శిబిరం ద్వారా 389 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, మిలాద్ జూలస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ ఆఫ్రాషా ఖాద్రీ, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, కాంగ్రెస్ నేతలు ఎన్‌పీ వెంకటేష్, షబ్బీర్ అలీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, టీం అధ్యక్షుడు తయాబ్ బశ్వర్,నవీద్, అబ్దుల్లా సున్నీ పాల్గొన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో బోయపల్లి గేట్ దగ్గర ఉన్న మోతీ మజీద్‌లో ప్రత్యేక రక్తదాన శిబిరం నిర్వహించి 160 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో కొత్వాల్, షబ్బీర్ అలీ, డాక్టర్ మేఘన, మధుసూదన్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మదన్‌మోహన్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చారెడ్డి, గోపాల్‌నాయక్, అత్తర్ అహ్మద్, గోపికాంత్, అశ్వినీ చంద్రశేఖర్, వైవీ రావు, బాలరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.



రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం

మెట్టుగడ్డ: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక టీఎన్జీవో భవనంలో సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసయ్య, సిద్ధిలింగం, లక్ష్మణ్‌గౌడ్, హన్మంతరెడ్డి, జగదీశ్, రమాలాలమ్మను శాలువా, మెమెంటోతో సన్మానించారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, గౌరవాధ్యక్షుడు రామేశ్వరయ్య, ఉపాధ్యక్షుడు రాజసింహుడు, ప్రధాన కార్యదర్శి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.